ప్రజాశక్తి
శనివారం 14 సెప్టెంబర్ 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





దెబ్బతిన్న గృహాల సర్వే
పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ జె.వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వరద విపత్తుతో దెబ్బతిన్న గహాల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. లంక గ్రామాలలో ఇంటింటా సర్వే పై స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో శుక్రవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కష్ణానది వరదకు బాపట్ల జిల్లాలోని లంక గ్రామాలు అధికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. 24 లంక గ్రామాలలోని నష్టాన్ని సర్వేలో క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. నష్టం అంచనాల సర్వే కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఇందుకోసం నూతన యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. వరద ధాటికి దెబ్బతిన్న ప్రతి ఇంటినీ సర్వే సమయంలో ఫొటో తీయాలని, యాప్ ద్వారా సదరు ఇంటి యజమాని ఫొటోను తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న గహం వివరాలు స్పష్టంగా పొందుపరచాలన్నారు. ఆ ఇంటిలో టీవీ, ఫ్రిజ్ దెబ్బ తింటే వాటి కంపెనీ పేర్లతో సహా వివరాలు నమోదు చేయాలన్నారు. ఎవరివైనా వాహనాలు దెబ్బతింటే సర్వే యాప్‌లో వాటి ఫొటోలు తీయాలని, సదరు వాహనం కంపెనీ పేరునూ నిక్షిప్తం చేయాలన్నారు. ప్రాథమికంగా 13 పక్కాగహాలు దెబ్బతినగా, 163 కచ్చా గహాలు, మరికొన్ని గహాలు దెబ్బతిన్నాయన్నారు. జీవనోపాధి కోల్పోయి ఉంటే వాటి ఫొటోలను తీసి యాప్‌లో పంపాలన్నారు. పశువులకు సంబంధించిన షెడ్లు వివరాలు పొందుపర్చాలన్నారు. లంక గ్రామాలలో కొందరికి ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు లేవని అధికారులు కలెక్టర్ దష్టికి తెచ్చారు. యుద్ధ ప్రాతిపదికన వారికి బ్యాంకు ఖాతాలు తెరిచి, ఆధార్ కార్డులు ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. బాధితులకు మేలు జరిగేలా పనిచేయాలన్నారు. ప్రతి గంటకూ ఎన్ని గహాలు సర్వే పూర్తయ్యాయో వివరాలు పంపాలని ఆదేశించారు. సచివాలయాలలోని 11 మంది సిబ్బంది మొత్తం సర్వే పనుల్లో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. వీక్షణ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, రేపల్లె ఆర్డీవో హేలా షారోన్, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ జె.వెంకటమురళి

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలి..

- అదే ఏచూరికి ఇచ్చే నివాళి
- సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

దేశంలోని ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతూ సెక్యులర్ శక్తులను ఏకం చేసి ముందుకు నడవడమే సీతారాం ఏచూరికి ఇచ్చే ఘన నివాళి అని పలువురు వక్తలు కొనియాడారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభ శుక్రవారం ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో జరిగింది. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్ధయ్య మాట్లాడుతూ దేశంలో అతివాదం, మితవాదం పెరుగుతోందన్నారు. అధికారంలో ఉన్న మతతత్వ శక్తులు ప్రజాస్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని కూనీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెడరలిజం స్ఫూర్తి దెబ్బతింటుందన్నారు. రైతాంగ హక్కులు, ట్రేడ్ యూనియన్ల హక్కులకు పాతరేస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ శక్తులు రాజ్యమేలుతున్నాయని చెప్పారు. వీటికి వ్యతిరేకంగా పోరాడుతూ వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ, వాటి ఐక్యతను బలంగా చాటేందుకు వామపక్ష శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



సీతారాం ఏచూరి సంతాప సభలో నివాళులర్పిస్తున్న నాయకులు

దేశంలో అనేక సమస్యల మీద సీతారాం ఏచూరి రాజీలేని పోరాటం చేశారని, దేశ అభివృద్ధికి అవసరమైన అనేక సూచనలు ఆయన ప్రభుత్వాలకు అందించారని గుర్తు చేశారు. యుపిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కామన్ మినిమం ప్రోగ్రాం రూపొందించడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారని చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఇండియా కూటమిని ఏర్పాటు చేయడంలోనూ ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా తెలుగువాడు పని చేయడం ఎంతో గర్వకారణమన్నారు. ఏచూరి చూపిన బాటలో నియంత పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వామ పక్ష ప్రజాతంత్ర ఐక్యతను ▶ 2లో



సీతారాం ఏచూరి సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

కొలిక్కిరాని బదిలీల వ్యవహారం

- పాలకపక్ష నేతల మధ్య కనిపించని ఏకాభిప్రాయం
- గడువు పొడిగించడంతో మళ్లీ నేతల చుట్టూ ప్రదక్షిణలు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

గత నెలాఖరుతో ముగియాల్సిన బదిలీల ప్రక్రియ వరదల కారణంగా వాయిదా పడుతూ వస్తోంది. ఇప్పుడు ఈ నెల 22 వరకూ పొడిగించారు. దీంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. ఇప్పటికే రెండు నెలలుగా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తీసుకొని వారి శాఖల హెడ్‌లకు పంపించారు. జాబితాల్లో పేర్లు చేర్చుకున్నారు. జిల్లా నేతల సిఫార్సులు కీలకం. అందులో ఎమ్మెల్యేలతో పాటు చివరిగా మంత్రి ఆమోదం అత్యవసరం. ఇక్కడే సమస్య వచ్చింది. జిల్లా అధికారులు దాదాపుగా ఎవరన్నది ఎమ్మెల్యే దృష్టిలో జాబితా ఉంది. ఎవరికి నచ్చినవారికి వాళ్లు లేఖలు ఇచ్చారు. మిగతా వారి సంతకాలు కూడా తీసుకున్నారు. ఇదంతా జిల్లా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు సమన్వయంతో కూర్చుని మంత్రి డోలా వీరాంజనేయస్వామితో చర్చించి నిర్ణయాలు తీసుకోలేదు. దీంతో మంత్రి డోలా వీరాంజనేయస్వామి తన ప్రమేయం పరిమితంగా ఉందనే భావనతో పట్టీపట్టనట్లుగా ఉన్నట్లు సమాచారం. ఆయన్ను అడిగిన దామచర్లతో పాటు ఒకరిద్దరికి సంతకాలు పెట్టేశారు. మిగతా వారి విషయంలో తనకు సమాచారం లేదనే భావనలో మంత్రి డోలా ఉన్నట్లు చెబుతున్నారు. ఇదే విషయం తాజాగా సిఎం చంద్రబాబు దృష్టికీ వెళ్లింది. అందరూ కూర్చుని సమన్వయంతో నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ లోగా వరదలు వచ్చాయి. అయితే జిల్లా అధికారుల విషయంలో ఇప్పటికీ ఏకాభిప్రాయం కనిపించడం లేదు. నేతల మధ్య సమన్వయలోపం ఉంది. ఇంకా చెప్పాలంటే రెండు శిబిరాలుగా నేతలు చీలారనే చర్చ కూడా ఉంది. ఆధిపత్యం పాలకపక్ష నేతల కోసం పోరు నడుస్తోంది. ఇది ఎందాక పోతుందో చూడాలి. ఇప్పటికీ జిల్లా అధికారుల బదిలీల విషయంలో స్పష్టత లేదు. అందరూ కూర్చుని శాఖల వారీగా సమర్థులను గుర్తించి తెచ్చుకుందామనే ఆలోచనలో లేరు. అంతా పైరవీలే సాగుతున్నాయి. ఎమ్మెల్యేలతో సన్నిహిత సంబంధాలున్న కొందరు అధికారులు జిల్లా శాఖలను కోరుకున్నారు. ఎమ్మెల్యేలు లేఖలు ఇచ్చారు. ఇప్పటికే శాఖల వారీగా ఓ జాబితా నేతల మధ్య ఉంది. దీనిపైనే ఏకాభిప్రాయం కనిపించడం లేదు. ఇదే సమస్యతో దాన్ని పక్కనబెట్టేశారు. వరదలతో ఆ జాబితా మరుగునపడింది. ఇప్పుడు మళ్లీ సమయం పొడిగించారు. నేతలపై ఒత్తిళ్లు యధాతథంగా ఉన్నాయి. జాబితాలో పేర్లు మారిపోతాయా? యధాతథంగా ఉంటాయా? అన్నదీ చూడాలి. ఇక రెవెన్యూశాఖలో ఉమ్మడి ప్రకాశం జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకున్నారు. సొంత జిల్లా వారిని ఈ ప్రాతిపదికన అర్హతను పరిగణించాలని ప్రతిపాదించారు. దీంతో ఇప్పటికే కొన్ని స్థానాలు కోరుకుని సిఫార్సు ▶ 2లో



మాట్లాడుతున్న దామచర్ల

ఇళ్ల స్థలాలలో అనర్హులను తొలగిస్తాం.. ▶ 8లో

వారం రోజుల్లో తేల్చుకుందాం

వైసిపి కార్పొరేటర్లతో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తన రాజకీయ వైఖరి ఏంటనే విషయం వారం రోజుల్లో తేల్చుకుంటానని, ఈ లోపు వైసిపి కార్పొరేటర్లు ఎవరూ అధైర్యపడవద్దని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలులోని పలువురు వైసిపి కార్పొరేటర్లు శుక్రవారం హైదరాబాద్‌లో బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన నివాంలో కలిశారు. ఈ సందర్భంగా ఒంగోలు కార్పొరేషన్ రాజకీయాలు, ఇటీవల వైసిపిని వీడి పలువురు కార్పొరేటర్లు టిడిపిలో చేరిన విషయాలను బాలినేని వద్ద కార్పొరేటర్లు ప్రస్తావించారు. టిడిపిలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని, బెదిరింపులకు దిగుతున్నారని వైసిపి కార్పొరేటర్లు బాలినేనికి చెప్పారు. ఈ విషయం మీద స్పందించిన బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపి కార్పొరేటర్లకు తాను అండగా ఉంటానని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. ఇంకా ఎవరైనా టిడిపిలోకి వెళ్లేవారు ఉంటే వెళ్లవచ్చని, అక్కడొకమాట.. ఇక్కడొక మాట వద్దని ఆయన సూచించారు. తన రాజకీయ వైఖరిని వారంలో స్పష్టం చేస్తానని ఈ సందర్భంగా ఆయన కార్పొరేటర్లతో చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలి

(మొదటిపేజీ తరువాయి)

చాటుతూ పోరాటాలను బలోపేతం చేయడమే ఏచూరికి ఇచ్చే ఘనమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఏచూరి మరణం వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని చెప్పారు. ఆయన చూపిన బాటలో అందరూ నడవాలని కోరారు. సిపిఐ రాష్ట్ర నాయకులు ఎం.వెంకయ్య మాట్లాడుతూ ఏచూరి డైనమిక్ లీడర్ అని చెప్పారు. దేశంలో రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి దాన్ని ముందుకు నడిపే క్రమంలో ఏచూరి మరణం దేశానికి తీరని లోటని చెప్పారు. అధ్యయనం, ఆచరణ ద్వారా ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకు వెళ్లడమే ఏచూరికి ఇచ్చే నివాళి అని చెప్పారు. సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు లలితకుమారి మాట్లాడుతూ సైద్ధాంతిక అవగాహన కలిగిన ఏచూరి మరణం విప్లవ ఉద్యమానికి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటని చెప్పారు. వామపక్షాల ఐక్యతను ముందుకు తీసుకు వెళ్లడమే ఏచూరికి ఇచ్చే నివాళి అని పేర్కొన్నారు. కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ దేశంలో సెక్యులర్ శక్తులందరినీ కలుపుకొని ప్రత్యామ్నాయ విధానాలు కొనసాగింపు కోసం ముందుకు నడవడమే ఏచూరికి ఇచ్చే నివాళి అని చెప్పారు. డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి ఏది అవసరమో గుర్తించి ఆ దిశగా ఏచూరి అడుగుజాడల్లో అంతా నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఎస్‌కె మాబు, కంకణాల ఆంజనేయులు, నగర పార్టీ కార్యదర్శి జి రమేష్, డాక్టర్ రంగారావు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, తదితరులు పాల్గొన్నారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్ర పటానికి డాక్టర్ రంగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత పార్టీ శ్రేణులంతా ఏచూరికి నివాళులర్పించారు.

కొలిక్కిరాని బదిలీల వ్యవహారం

(మొదటిపేజీ తరువాయి)

లేఖలు ఇచ్చిన అధికారులు గందరగోళంలో పడ్డారు. కొత్త స్థానాలు వెతుక్కోవాల్సి వచ్చింది. ఆర్టీఓల విషయంలో ఇలాంటి సమస్యే ఎదురైంది. మరో వైపు డిప్యూటేషన్లపై ఇతర శాఖల్లో పనిచేసే వారిని కూడా మాతృశాఖలకు పంపుతున్నారు. ఏదేమైనా బదిలీల వ్యవహారం ఉత్కంఠగానే కొనసాగుతున్న తరుణంలో మళ్లీ పొడిగింపు అధికారులకు తలనొప్పిగానే మారింది. ఇక స్వల్పకాలంలో ఉద్యోగవిరమణ చేసే అధికారులను బదిలీలు చేయబోమని ప్రకటించడంతో చాలామంది సీనియర్ ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

పారిశుధ్యం పట్ల అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-కనిగిరి

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం కనిగిరి పట్టణంలోని సాయిబాబా థియేటర్ పరిసర ప్రాంత ప్రజల ఫిర్యాదు మేరకు ఆయన ఆ ప్రదేశంలో పర్యటించారు. వార్డులో గత కొన్ని రోజుల నుంచి చెత్త చెదారంతో, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోయారు. చెత్తా చెదారాన్ని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిబాబా థియేటర్ పరిసర ప్రాంతాల్లో డంపింగ్‌ను తీసివేసి త్వరలో చెత్తబుట్టలు ఏర్పాటు చేసేందుకు కమిషనర్ ద్వారా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. పారిశుధ్య శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బొట్లు శ్రీనివాసులు, అరుణోదర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యువకుడి వీరంగం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం వేశాడు. దత్తాత్రేయ స్వామి ఆలయం తలుపులు పగలగొట్టాడు. అంతటితో ఆగక రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనాలను తన వాహనంతో ఢీ కొట్టాడు. బట్టలు విప్పేసి దిగంబరంగా నడిరోడ్డుపై నిలబడి గ్రామస్తులను దుర్భాషలాడాడు. గ్రామ సర్పంచ్‌ని అసభ్య పదజాలంతో దూషిస్తూ మాట్లాడాడు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. మండలంలోని ఏ కొత్తపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు షేక్ నాగూరువలి బుధవారం రాత్రి సమయంలో మద్యం సేవించి భైరవకోనకు వెళ్లే దారిలో ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయం తాళం పగలగొట్టాడు. అనంతరం అక్కడ ఉన్న ముప్పాళ్ల ప్రశాంత్ రెడ్డి, ముప్పాళ్ల విక్రమ్ రాజులకు చెందిన ద్విచక్ర వాహనాన్ని తన కారుతో ఢీ కొట్టాడు. అటువైపుగా వెళుతున్న కంబాలదిన్నె కిషోర్, రామాయణం గ్రామ సుబ్బయ్యల ద్విచక్ర వాహనాలను కూడా ఢీ కొట్టినట్లు బాధితులు తెలిపారు. అనంతరం బట్టలన్నీ విప్పేసి దిగంబరంగా రోడ్డుపై నిలబడి గ్రామస్తులను, గ్రామ సర్పంచ్‌ని దుర్భాషలాడాడు. ఈ విషయంపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు విక్రమ్ రాజు తెలిపారు. అయితే స్థానిక పోలీసులు కేసు నమోదు చేయలేదని, దీంతో ఈ విషయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లి తనకు న్యాయం చేయాలని కోరినట్లు బాధితుడు విక్రమ్ రాజు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ బి ప్రేమ్ కుమార్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా మద్యం మత్తులో గ్రామస్తులను దుర్భాషలాడాడని, దీనిపై బాధితుడు వెంకట నరసయ్య ఉరఫ్ విక్రమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



వీరంగం వేస్తున్న యువకుడు

గుజరాత్ బృందం పంటల పరిశీలన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని పెదారికట్లలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలు, పండ్ల తోటలను గుజరాత్ రాష్ట్రానికి చెందిన 8 మంది రైతు బృందం, 8 మంది ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శుక్రవారం పరిశీలించింది. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన పొలాలను సందర్శించడానికి వచ్చారు. మహిళా రైతు గుళ్లపల్లి సుజాత 40 ఎకరాల పొలంలో వివిధ రకాల పంటలను సాగు చేశారు. అందులో కంది పంటలో జొన్న, సజ్జలో మినుములు, పెసర అంతర పంటలు వేశారు. 5 ఎకరాల్లో మామిడి పంట 7 రకాల్లో వేశారు. ఉసిరి, సపోటా, శ్రీగంధం, గంధం, ఎర్రచందనం, అరటి, సీతాఫలం, నిమ్మ, దానిమ్మ, మిరప, పసుపు, కూరగాయలు, ఆకు కూరలు పలు పంటలు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల ద్వారా సాగు చేశారు. వచ్చిన గుజరాత్ బృందం సభ్యులు సుజాత అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వేసవిలో 30 రకాల విత్తనాలతో నవధాన్యాలు సాగు చెయ్యడం, ద్రవజీవామృతం వాడడం వలన భూమి సారవంతంగా మారింది. అంతేకాకుండా పురుగులు తెగుళ్ల ఆశించవు అని ఆమె వివరించారు. మండల వ్యవసాయ అధికారి ప్రసన్న రంగలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేసిన పంటలను పరిశీలించిన గుజరాత్ రైతు బృందం

సిఐని కలిసిన ఎంపిపి

ప్రజాశక్తి-దర్శి

దర్శి సిఐ రామారావును తాళ్లూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి
శనివారం 14 సెప్టెంబర్ 2024

మతి స్థిమితం లేని మహిళకు వసతి కల్పించి...

మానవత్వం చాటుకున్న హోంగార్డు కాశయ్య

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు చెన్నుపల్లి కాశయ్యది విశాల హృదయం. ఏదొక పేద కుటుంబానికి, ఏ దిక్కూ లేని వారికి తాను ఉన్నాననే భరోసా కల్పిస్తున్నారు. తనకు తోచిన సాయం చేయడంతో పాటు మిత్రులతో కూడా ఆపదలో ఉన్న వారిని ఆదుకునేలా ప్రోత్సహించడం చెన్నుపల్లి కాశయ్య నైజం! ప్రతి నెలలో ఇబ్బందులకు గురైన ఒకటి రెండు కుటుంబాలను ఆదుకుంటూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

మార్కాపురం పట్టణంలోని నాగులవరం రోడ్డులో మీనా మసీదు దగ్గర భాను అనే మతిస్థిమితం లేని (ఒంటరి మహిళ) గత కొంత కాలంగా సంచరిస్తోంది. ఆమెకు ఇల్లు లేదు. మసీదు ఆరు బయట ఉన్న అరుగు ప్రదేశంలో ఆమె నివాసం ఉంటోంది. ఆమె నా అనే వారు ఎవరూ లేరు. సమీప గృహాల్లోని మహిళలు పిలిచి ఆహారం అందిస్తే గానీ ఆమె తీసుకోదు. ఆమె పస్తులున్న రోజులెన్నో ఉన్నాయి. ఎండైనా... వానైనా ఆ అరుగు మీద ఉండిపోవాల్సిందే. ఇటీవల కొద్ది రోజులకు ఎడతెరపి లేని వర్షాలకు సైతం ఆమె అక్కడే పడుకోవడాన్ని హోంగార్డు చెన్నుపల్లి కాశయ్య చూసి చలించిపోయాడు. చలికి గజగజ వణికి పోవడాన్ని గమనించాడు. ఆమె వర్షానికి తడవకుండా ఉండేందుకు వసతి కల్పించాలనుకున్నాడు. ఆమె పడుతున్న ఇబ్బందిని వీడియో ద్వారా అందరికీ తెలియజేశాడు. షేక్ మహమ్మద్ జాఫర్ రూ. 1000, అడపా ఉమారాణి, చంద్రాణి, ఇంద్రాణి, మాధవిలు కలిసి రూ. 1600 ఆర్థికంగా చేయూతనిచ్చారు. ఆ నగదుతో ఇనుప స్టాండు తయారు చేశారు. మొత్తానికి ఫ్లెక్సీలతో ఒక చిన్న షెల్టర్ ఏర్పాటుతో ఆమెకు తాత్కాలిక వసతి కల్పించారు. ఎస్ఎస్‌వి ఫర్నీచర్ వారి సహకారంతో మంచం, పరుపు అందించారు. దీనికి సంబంధించిన వెల్డింగ్ పనులను దిలీప్ వెల్డింగ్ షాప్ వారు నిర్వహించారు. ఈ పాటికే పలువురు అభాగ్యులకు నిత్య భోజనం అందించే ప్రక్రియ కూడా చెన్నుపల్లి కాశయ్య చేపట్టాడు. తన సాయంతో పాటు ఇతరుల సహకారంతో ఆపదలో ఉన్న వారినీ, ఏ దిక్కూ లేని వారికి నేనున్నానంటూ మానవత్వాన్ని చాటుతున్న హోంగార్డు కాశయ్య స్పందించే తీరును పలువురు కొనియాడుతున్నారు.



వసతి లేక ముందు



వసతి కల్పించిన తర్వాత

విరాళాలు అందజేత

ప్రజాశక్తి- కొమరోలు

విజయవాడ వరద బాధితులకు కొమరోలు మండల పరిధిలోని అల్లీనగరం గ్రామంలోని శ్రీ మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ సాయంగా అందజేశారు. విరాళాల ద్వారా సేకరించిన రూ.18,120, ఉపాధ్యాయుల జీతాల నుంచి మినహాయించిన రూ. 27,048 కలిపి మొత్తం రూ. 45,168 ఫోన్ పే ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి శుక్రవారం పంపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు అవార్డు గ్రహీత దాసరి గురుస్వామి మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటనారాయణ, కోటేశ్వరరావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సుజాత, ప్రకాష్ రావు, శివరాం, చంద్రమోహన్, గురువయ్య, పాల్గొన్నారు.

యుడైస్ ప్లస్‌పై శిక్షణ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు


మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్థానిక విద్యావనరుల కేంద్రంలో యుడైస్ ప్లస్‌పై శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ కార్యాలయ ఎఎస్‌ఎ కృష్ణ కుమార్ మాట్లాడుతూ యుడైస్ ప్లస్‌కు సంబంధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు అందుకు సంబంధించి తగు సూచనలు తెలిపారు. విద్యాశాఖకు సంబంధించిన అన్ని అంశాలపై సమీక్ష నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంఇఒలు రవి, రమణయ్య, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది నాగార్జున, వెంకాయమ్మ, సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

చీమకుర్తి: ప్రభుత్వ,ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలలు యుడైస్ ప్లస్ ఆన్‌లైన్ అప్‌డేట్‌ను ఈనెలాఖరు లోపు పూర్తి చేయాలని ఎంఇఒ-1 నరసింహారావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ యుడైస్‌ప్లస్‌లో టీచర్ ప్రొఫైల్,స్టూడెంట్ ప్రొఫైల్,వసతుల పొఫైల్‌లను పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో వసతుల కల్పనకు,నిధుల కేటాయింపుకు యుడైస్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బండి శ్రీనివాసరావు, వివిధ ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి ఉపాధ్యాయుడు కాకర్ల సత్యనారాయణ దంపతులను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఆంజనేయులు మాట్లాడుతూ కాకర్ల సత్యనారాయణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం యర్రగొండ పాలెం మండలానికే గర్వ కారణమన్నారు. విధి నిర్వహణలో ఎప్పటికప్పుడు నూతన ఒరవడులతో విద్యార్థులకు మార్గదర్శకమై అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. ఆడపిల్లలంటే కేవలం చదువు, ఇంటికి మాత్రమే పరిమితం కాకుండా ఎన్‌సిసి ద్వారా వారికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గురువు కాకర్ల సత్యనారాయణ అని పేర్కొన్నారు. యన్‌సిసిలో ఎంతో మంది విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులను, ట్రిపుల్ ఐటి సీట్లు సాధించటంలో ప్రత్యేక శిక్షణ ద్వారా మారుమూల పశ్చిమ ప్రకాశం విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పాఠశాల కమిటీ చైర్మన్ పఠాన్ రసూల్ ఖాన్, సన్మాన గ్రహీత కాకర్ల సత్యనారామయణ, ఆయన సతీమణి రామా జ్యోతి, ఉపాధ్యాయులు భాస్కర్, బ్రహ్మయ్య, సలాం, తేజా నాయక్, రజనీ, సరస్వతి, సిఆర్‌ఎంటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలకు బెంచీలు బహూకరణ

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 - 93 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు పాఠశాలకు రూ.1.25 విలువైన బెంచీలు బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముతోజు సుధాకర్ శుక్రవారం చెంచీలు అందజేశారు. పాఠశాల ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలకు తమ వంతు ఆర్థిక సాయం అందజేశారు. పూర్వ విద్యార్థులు షేక్ యూసఫ్ షరీఫ్ రూ.20,075, షేక్ షుకూర్ రూ.5,075, వాడేలా కష్ణ ప్రసాద్ శర్మ రూ.5,075 అందజేశారు. 1992 - 93 బ్యాచ్‌కు చెందిన వెన్నా రాజారామిరెడ్డి ఇదే పాఠశాలకు స్కూల్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నజీర్, ఉపాధ్యాయులు గోసు శ్రీనివాసులు, ఆనంద్ బాబు, చెంచయ్య నాయుడు, సిఆర్‌పి ప్రభాకర్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వెన్నా రాజారామిరెడ్డిని సన్మానిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు



చిల్లచెట్లను తొలగిస్తున్న కూలీలు

చిల్లచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రజాశక్తి కథనానికి స్పందన

చిల్లచెట్ల తొలగింపునకు చర్యలు చేపట్టినట్లు విద్యుత్ ఎఇ చెన్నారెడ్డి తెలిపారు. గురువారం ప్రజాశక్తి దిన పత్రికలో ప్రచురితమైన రైతులకు కరెంటు కష్టాలు అనే కథనానికి ఎఇ స్పందించారు. మండలపరిధిలోని దొడ్డవరం-తెల్లబాడు గ్రామాల్లో పొలాలకు వెళ్లే విద్యుత్తు లైన్‌లను కమ్మేసిన చెట్లను కూలీల చేత తొలగించే చర్యలను శుక్రవారం చేపట్టారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కరెంటు సరఫరా జరిగే విధంగా చూస్తామని ఎఇ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దొడ్డవరం-తెల్లబాడు గ్రామాల్లో ఘుడియాపూడి అగ్రికల్చర్ ఫీడర్ లో కరెంటు సరఫరాకు శనివారం అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ చెన్నారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఎమ్మెల్యే ముత్తుముల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గిద్దలూరు

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న శ్రీ కనకదుర్గ అమ్మవారిని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొత్తపల్లె శ్రీనివాసులు, నంది శ్రీను, శ్రీనివాస చౌదరి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోని ఎం.నిడమనూరు గ్రామానికి చెందిన రైతులు 1,115 పొగాకు బేళ్లు అమ్మకానికి తెచ్చారు. అందులో 940 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 175 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ. 358, అత్యల్ప ధర రూ.190, సరాసరి ధర రూ.301-80 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి : కొండపి వేలం కేంద్రానికి జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం , పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 1,354 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,009 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 345 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.358, అత్యల్ప ధర రూ.180, సరాసరి ధర రూ.268.88 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. వేలంలో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



వరద సహాయం అందజేస్తున్న రామకూరు గ్రామస్తులు

రామకూరు గ్రామస్తుల సాయం

ప్రజాశక్తి - పంగులూరు

వరద బాధితులకు అండగా నిలిచేందుకు మండలంలోని రామకూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్తలు, ప్రజలు ముందుకు వచ్చారు. తెలుగుదేశం గ్రామ నాయకులు, పంచాయతీ ఉప సర్పంచ్ పేడవల్లి అశోక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు వసూలు చేసిన రూ. 1.70వేలను ముఖ్యమంత్రి సహాయ నిధిలో జమ చేసేందుకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు శుక్రవారం అందజేశారు. కష్టకాలంలో ప్రజలను ఆదుకునేందుకు ప్రజలు, తెలుగుదేశం కార్యకర్తలు ముందుకు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం రామకూరు గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.



సిఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న శివప్రసాద్

పేదలకు వరం సీఎం సహాయనిధి

ప్రజాశక్తి - రేపల్లె

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివ ప్రసాద్ అన్నారు. మండలంలోని చాట్రగడ్డ గ్రామానికి చెందిన ఉయ్యూరు వెంకట నాగేశ్వరరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని మంత్రి సత్య ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లడంతో వైద్య ఖర్చులుకు రూ. 17 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేయిస్తూ అనుమతి లేఖను అనగాని శివప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చాట్రగడ్డ సర్పంచ్ వూయ్యూరు గంగాధర్, వాకా శ్రీనివాసరావు, జొన్న వాసు, జొన్న రామస్వామి, మోర్ల అంజయ్య పాల్గొన్నారు.



నిత్యవసరాలు పంపిణీ చేస్తున్న చీరాల సేవా సంఘం

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవానిపాలెం పంచాయతీలో చీరాల సేవా సంఘాల సమైక్య ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యవసర సరుకులు, బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ కన్వీనర్ ఎం రాఘవేంద్రరావు మాట్లాడుతూ కృష్ణ నది వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలను తమ సభ్యులందరూ కలిసి రూ. 5లక్షల విలువ చేసే నిత్యవసర సరుకులు, బట్టలు పంపిణీ చేయడం సంతోషంగా ఉన్నదని అన్నారు. చీరాల ఎంఎల్ఎ కొండయ్య ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకొందడం గొప్ప విశేషమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి టి కృష్ణమోహన్, చీరాల సేవా సంఘ సమైక్య సభ్యులు మురళీకృష్ణ, మధుసూదనరావు పాల్గొన్నారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఘన నివాళి



పంగులూరులో ఏచూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం




మేదరమెట్లలో ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఏచూరికి నివాళులర్పిస్తున్న ముండ్లమూరు నాయకులు

ప్రజాశక్తి - పంగులూరు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం సిపిఎం ఉద్యమానికే కాకుండా వామపక్ష ఉద్యమానికి తీరని లోటుని సిపిఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు అన్నారు. ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ తాను 1980లో లూధియానాలో డివైఎఫ్ఐ మొదటి మహాసభకు హాజరైన సందర్భంగా ఏచూరిని చూశానని అన్నారు. సిద్ధాంతకర్త, మంచి ఉపన్యాసకుడని, పోరాటయోధుడని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాయిని వినోద్ బాబు, సిపిఎం కార్యదర్శి తలపనేని రామారావు, తలపనేని సుబ్బారావు, గుడిపాటి మల్లారెడ్డి, పి ఆదుం సాహెబ్, తలపనేని సుబ్బారావు, రాయిని వెంకట సుబ్బారావు, సంపెంగల వెంకట్రావు, నాగాలాండ్ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, నాగబోయిన రామంజమ్మ, రాయిని కృష్ణకుమారి, పి ఏలియా పాల్గొ న్నారు. బైటమంజులూరులో జరిగిన కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూసపాటి సుబ్బరాజు, సరికొండ రామచంద్ర రాజు, లక్ష్మణ్ రాజు, సరికొండ కృష్ణంరాజు, లక్ష్మీనారాయణరాజు, ఎస్ సుబ్బరాజు, రమాదేవి, ఎస్ ప్రమీల, ఎస్ అనంతమ్మ, నాగాంజలి పాల్గొన్నారు.



ఏచూరికి నివాళి అర్పిస్తున్న మార్టూరు సిపిఎం నాయకులు

మార్టూరు రూరల్ : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి సిపిఎంకు తీరని లోటని సిపిఎం మార్టూరు, యద్దనపూడి ప్రాంతీయ మండలాల కార్యదర్శి బత్తుల హనుమంతరావు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో కందిమళ్ల రామకోటేశ్వరరావుతో కలిసి ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం నాయకులు ఎనికపాటి రాంబాబు, బొడెంపూడి సూరిబాబు, లక్ష్మి సామ్రాజ్యం, గఫూర్, గోలి మల్లికార్జున్, మొఘల్, షరీఫ్ పాల్గొన్నారు.

మేదరమెట్ల : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఉత్తమ పార్లమెంటేరియన్ కామ్రేడ్ సీతారం ఏచూరి (72) మృతికి కొరిశపాడులోని సిపిఎం కార్యాలయంలో ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి ఎం ఆంజనేయులు, చెన్నుపాటి హరిబాబు, బొంత దశరథ, కొల్ల సుబ్బారావు, వై రవీంద్రబాబు, ఎం పెద్ద సుబ్బారావు, డి మాణిక్యరావు, వైకుంఠం, జయమ్మ, అన్నపూర్ణ, యుటిఎఫ్ నాయకులు కంచర్ల పోతురాజు పాల్గొన్నారు.



పర్చూరులో ఏచూరికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పర్చూరు : స్థానిక సిఐటియు కార్యాలయంలో సిపిఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి శుక్రవారం ఘనంగా నివాళి అర్పించారు. సిపిఎం నాయకులు కె శ్రీనివాసరావు, సిఐటియు మండల కార్యదర్శి బి చిన్నదాసు, అధ్యక్షులు ఎం డేవిడ్ పాల్గొన్నారు.

ముండ్లమూరు : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ సిపిఎం నాయకులు పంట ఏడుకొండలు అధ్యక్షతన వేంపాడులో శుక్రవారం నిర్వహించారు. ఏచూరి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, సత్యం, మీరావలి, అంజయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, రామాంజనేయులు, మదన్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) మృతి సిపిఎంకు, వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. స్థానిక రద్దం సెంటర్ వద్ద ఏచూరి చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు పప్పల ఎర్రాయం పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు సత్యనారాయణ, రామస్వామి, దీపాల సత్యనారాయణ, ఆహరోను, గోళ్ళ నాగరాజు, బసవకోట్లు, నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, బసవయ్య, దానియేలు, సారథి, పెసర్లంక మాజీ సర్పంచ్ సుబ్బారావు, పి మనోజకుమార్ పాల్గొన్నారు.

కొల్లూరు : కామ్రేడ్ సీతారాం ఏచూరి (72) చిత్రపటానికి స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం నాయకులు శుక్రవారం నివాళి అర్పించారు. సిపిఎం మాజీ ఎంపీపీ అమృతులూరు కృపానందం, బొనిగల సుబ్బారావు, పరిశుద్ధరావు మాట్లాడారు. కార్యక్రమంలో తోడేటి శ్రీను, చాట్ల సుధాకర్, యశ్వంత్, జయలక్ష్మి, దివ్య, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చీరాలలో ఏచూరికి నివాళులు అర్పిస్తూన్న విద్యార్థులు

చీరాల : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి విజయనగర కాలనీ పాఠశాల విద్యార్థులతో కలిసి జగజ్జీవనరావు చైర్ పరిశోధకులు తేళ్ళ రాంబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. రాంబాబు మాట్లాడుతూ జెఎన్‌యు విద్యార్థి సంఘం నుంచి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయి ఎదిగి ఉత్తమ రాజ్యసభ సభ్యుడిగా సేవలు అందించిన ఏచూరి జీవితం ఎంతోమందికి స్ఫూర్తి అన్నారు.


ఇంకొల్లు : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యమ్రంలో సిపిఎం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, నాగండ్ల వెంకట్రావు, సిపిఎం చీరాల కార్యదర్శి ఎన్ బాబురావు పాల్గొన్నారు.



కొల్లూరులో ఏచూరి చిత్ర పటానికి నివాళి



ఏచూరికి నివాళి అర్పిస్తున్న సిపిఎం భట్టిప్రోలు నాయకులు



ఏచూరికి నివాళి అర్పిస్తున్న సిపిఎం ఇంకొల్లు నాయకులు

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి



కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న రైతు నాయకులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు, కౌలు రైతు సంఘాల కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు, కౌలు రైతు సంఘం నాయకులూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు వెంటనే అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రుణాలు మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని, స్మార్ట్ మీటర్లు జిఓ నంబర్ 22ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎనికపాటి రాంబాబు, పి సాంబశివరావు, పెంట్యాల హనుమంత రావు, నాగేశ్వరరావు, బొడెంపూడి సూరిబాబు పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని కల్లంవారి పాలెంలో రైతులు శుక్రవారం సచివాలయలో కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు ఎర్రం సుబ్బారెడ్డి, సిఐటియు కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి మాట్లాడారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో పెండింగులో ఉన్న పాస్ పుస్తకాలు, 1బి అడంగల్ రానందున రైతులు బ్యాంకు రుణాలకు అనర్హులవుతున్నారని చెప్పారు. రూ. 2లక్షల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రం సుబ్బారెడ్డి, గుడిపాటి పద్మ, మోదుగుల లీలమ్మ, తాటిపర్తి సుధాకర్, పులకండం అంజిరెడ్డి, భవనం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



కళ్ళంవారిపాలెం కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న రైతులు



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి

దళిత నేత నీలం నాగేంద్రరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు, అంబేద్కర్ భవనంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శనివారం జరుగుతున్న సభకు ఎస్‌సి ఐక్యతావాదులు హాజరుకావాలని దళితహక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు పిలుపునిచ్చారు. శుక్రవారం తన కార్యాలయంలో నాగేంద్రరావు మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ జరగకుండా ఎస్‌సి రిజర్వేషన్లను సుప్రీంకోర్టు తీర్పుతో నిర్ణయించలేరన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలు చేయాలంటే రాజ్యాంగ సవరణ ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. దళిత వ్యతిరేకుల బారి నుంచి ఎస్సీ రిజర్వేషన్లను కాపాడేందుకు బాబాసాహెబ్ అంబేద్కర్ ఆర్టికల్ 341 తీసుకువచ్చారని, ఆర్టికల్ 341 సవరణ చేయకుండా, సుప్రీం కోర్టు తీర్పుతో రిజర్వేషన్లను వర్గీకరించలేరన్నారు. మనువాదుల కుట్రను, బిజెపి కుతంత్రాన్ని దళితులు అర్థం చేసుకోవాలని, శనివారం ఒంగోలులో జరిగే ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక సభను విజయవంతం చేయాలని నాగేంద్ర పిలుపునిచ్చారు. సమావేశంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లి పంచాయితీ పరిధిలో గల బోయలపల్లి, చిన్న బోయలపల్లి గ్రామాల్లో ప్రజలు, బాల బాలికలకు ఆన్‌లైన్ మోసాలపై సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సార్డ్స్ సంస్థ ఏపిఎం మందా మరియబాబు మాట్లాడుతూ ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండి ఆన్‌లైన్ మోసాలను, మూఢనమ్మకాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సార్డ్స్ సంస్థ సిబ్బంది జి మహాలక్ష్మి, శశి మోహన్, సుప్రియ పాల్గొన్నారు.



డ్రాయింగ్ పోటీలను పర్యవేక్షిస్తున్న మాల్యాద్రి

జూనియర్ ఛాంబర్ వారోత్సవాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జూనియర్ ఛాంబర్ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు విద్యార్థులతో కాపు కళ్యాణ మండపంలో సందడి నెలకొంది. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మూడు విభాగాల్లో డ్రాయింగ్ పోటీలు, ప్రకతి విధ్వంసం - పరిష్కార మార్గాలు' అనే అంశంపై వ్యాసరచన, చిరుకథల పోటీలు, జోక్స్ పోటీలు, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోటీలు జరుగుతూనే ఉన్నాయి. దాదాపు 400 మందికి పైగా పాల్గొన్నారు. ఈ పోటీలను పూర్వ అధ్యక్షులు రామాంజనేయులు, కసిబిసి నాగేశ్వరరావు ప్రారంభించారు. కథల పోటీలకు ప్రజానాట్యమండలి నాయకులు, రచయిత, దర్శకుడు బొంతు దశరథ, రచయితల సంఘం నాయకులు, జర్నలిస్టు పొన్నూరు శ్రీనివాసులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.. అనంతరం రెడ్ క్రాస్ ప్రాంగణం లో బిజినెస్ పీపుల్ మీట్ జూనియర్ ఛాంబర్ వారోత్సవాల చైర్మన్ శబరీ పి నాయర్, కార్యదర్శి సాత్విక్ రాజ్ అధ్యక్షతన జరిగింది. యువ వ్యాపార వేత్త అవార్డు ధర్మతేజారెడ్డికి జూనియర్ ఛాంబర్ అధ్యక్షులు కెవి వరుణ్ అందజేశారు. కార్యక్రమంలో కో చైర్మన్స్ పి.శివకోటిరెడ్డి, గంధవల్ల బాలకష్ణ, పూర్వ కార్యదర్శి ఎన్.మాల్యాద్రి పాల్గొన్నారు.

గుంతలు పూడ్చి..రోడ్డు వేయాలి..

ట్రాన్స్‌కో ఎస్ఇకి నగర అభివృద్ధి కమిటీ వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో 132 కెవి డబుల్ కేబుల్ అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ మంగమ్మ కాలేజీ జంక్షన్ వద్ద నుండి కర్నూలు రోడ్డు పవర్ ఆఫీస్ వరకు భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్లు వేశారని, దీంతో గుంటలు ఏర్పడి రోడ్డు మరమ్మతులను కరెంటు డిపార్ట్మెంట్ వారు రోడ్డు వేయకుండా వదిలివేసిన గుంటలు పూడ్చి రోడ్డు వేయాలని కరెంటు ట్రాన్స్‌కో ఎస్ఇ శ్రీనివాస రావుకు ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ తరపున అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మారెళ్ల సుబ్బారావు, టి.భక్తసింగ్‌రాజు మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ కేబుల్ వల్ల ఏర్పడిన గుంటల వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. వెంటనే గుంటలు



ఎస్ఇకి అర్జీ ఇస్తున్న నగర అభివృద్ధి కమిటీ నాయకులు

పూడ్చిరోడ్డు వేయాలని ప్రమాదాల నుండి ప్రజలను కాపాడాలని కోరారు. అండర్ కేబుల్ పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు మరమ్మతులు ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి వేయిస్తామని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు నగరాభివద్ధి కమిటీ కోశాధికారి బత్తుల మునలారెడ్డి, నాయకులు చాగంటి వీరరాఘవులు, జి.భీష్మాచారి, పౌర సంఘాల సమైక్య కన్వీనర్ జి.రమేష్ పాల్గొన్నారు.

అటవీ శాఖ నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని ఫారెస్ట్ కాంప్లెక్స్ ఆవరణలో కొర్రప్రోలు అటవీ శాఖ నూతన కార్యాలయ భవనాన్ని శుక్రవారం డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్ మార్కాపురం విఘ్నేష్ అపావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇంటి మాదిరిగా ప్రతి విషయంలో చొరవ తీసుకొని సరైన ప్రమాణాలతో భవన నిర్మాణానికి కషి చేసిన కొర్రప్రోలు ఎఫ్ఆర్వో ప్రసన్న జ్యోతి, ఎఫ్ఎస్‌వో షేక్ ఎండి అన్వర్ భాష, ఏబివో మహబూబ్ బాషాలను ప్రత్యేకంగా అభి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిఎఫ్‌వో విఘ్నేష్ అపావు

నందించారు. కార్యక్రమంలో అటవీ క్షేత్రాధికారులు ప్రసన్న జ్యోతి, విశ్వేశ్వర రావు, నీలకంఠేశ్వరరెడ్డి, వరప్రసాద్, డివిజన్ ఆఫీస్ సూపర్డెంట్ వెంకట కష్ణయ్య, మార్కాపురం యూనిట్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.1.5 లక్షల విరాళం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఒంగోలు మాంటిస్సోరి హైస్కూలు యాజమాన్యం రూ.1.5 లక్షల విరాళాన్ని అందజేసింది. వరద బాధితుల సహాయార్థం విద్యార్థుల నుండి సేకరించిన రూ.65,000 పాఠశాల యాజమాన్యం రూ.85,000.. మొత్తం 1,50,000 చెక్కును శుక్రవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకి మాంటిస్సోరి హైస్కూలు చైర్మన్ పి.ప్రకాష్‌బాబు అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు సేకరించిన పి.ప్రకాష్ బాబును ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు అభినందించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, హైస్కూలు ప్రిన్సిపల్ నూరుద్దీన్ పాల్గొన్నారు.



దామచర్లకు విరాళం అందజేస్తున్న ప్రకాష్‌బాబు

బాలినేని అవినీతిని నిరూపిస్తా..

టిడిపి నగర నాయకులు అశోక్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు ప్రణీత్ రెడ్డి, వియ్యంకుడు కుండా భాస్కర్‌రెడ్డి అవినీతి, అక్రమాలను ఆధారాలతో నిరూపిస్తామని టిడిపి ఒంగోలు నగర నాయకులు చెంగలశెట్టి అశోక్ తెలిపారు. కాపు కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఒంగోలు నగరాన్ని సర్వనాశనం చేశారని, ఆయన కుమారుడు ప్రణీత్ రెడ్డి అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బాలినేని అన్ని చేసి తాను ఏమీ తప్పు చేయలేదని, ఏ విచారణకైనా సిద్ధమని కాకమ్మ కథలు చెబుతున్నారన్నారు. ఆయన వియ్యంకుడు కుండా భాస్కర్ రెడ్డి టంగుటూరు మండలం అనంతవరం గ్రామంలో 52.2 సెంట్ల భూమిని కొనుగోలు చేశారని, సుమారు 189.2 ఎకరాల భూమిని ఆక్రమించారన్నారు. బకింగ్ హం కెనాల్ భూములను సైతం ఆ క్రమించారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ బాలినేని అక్రమాలపై ఫిర్యాదు చేస్తే ఉలిక్కిందుకని ప్రశ్నించారు. బాలినేని శ్రీనివాస రెడ్డి ఏ విచారణకైనా సిద్ధమని, వీటిపై ముఖ్యమంత్రిని కలుస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవినీతి అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని బాలినేని శ్రీనివాసరెడ్డికి సవాల్ విసిరారు.



మాట్లాడుతున్న అశోక్

బాలినేనిని అధికార పార్టీలో చేర్చుకోవద్దు..

జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గత ఐదేళ్ళ కాలంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని అధికార పార్టీలుగా ఉన్న తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ చేర్చుకోవద్దని జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలినేని అవినీతి అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. బాలినేని శ్రీనివాస్‌రెడ్డి అనుచరులు భూకబ్జాలు చేస్తూ దొంగ రిజిస్ట్రేషన్ లతో ఒంగోలు పట్టణంలో భయానక వాతావరణాన్ని సష్టించారన్నారు. వీటి పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సిట్‌ను పునరుద్ధరించి దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పోల్ సెంటర్ సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ కారణం వల్ల నగరంలోని జడ్పీ కాలనీ, విలేకరి కాలనీ, శివప్రసాద్ కాలనీ, కొత్త డొంక, గాంధీనగర్, మర్రిచెట్టుకాలనీ, శివాజీనగర్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు శనివారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందని డిఇఇ జి వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.



క్విజ్ పోటీలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

క్విజ్ పోటీలపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరిట ఆన్‌లైన్‌లో నిర్వహించే క్విజ్ పోటీల గురించి శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది రవి, ఇమ్మానియేల్ మాట్లాడుతూ ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైందన్నారు. దీనిలో మూడు విడతల ప్రైజ్‌లు ఉంటాయని తెలిపారు. అవి స్టేట్, జోనల్, నేషనల్ స్థాయిలో ఉంటాయన్నారు. విద్యార్థులు ఈనెల 17వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 19 నుంచి 21వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఆన్ లైన్ విధానంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సావిత్రి, అధ్యాపకులు డాక్టర్ కే విజయబాబు, డాక్టర్ ఎన్ శ్రీనివాసచార్యులు, షేక్ అక్రమ్, జి రమేష్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్స్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రకేసరి యూనివర్శిటీలో 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ బోధనాంశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీ కళాశాలలో ఉన్న బోధనా విషయాలలో ఎంఎస్‌సి (ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఎంఎస్‌సి (కంప్యూటర్ సైన్స్), ఎంకాం, ఎంబిఏ, బిపిఎడ్, ఎంపిఎడ్ కోర్సుల్లో బోధించటానికి తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. సంబంధిత సబ్జెక్టులలో అర్హత, అనుభవం కలిగిన అభ్యర్థులు వారి బయోడేటాకు అటెస్ట్ చేసిన విద్యార్హతల ధవీకరణ పత్రాలు, అనుభవం సర్టిఫికెట్లతో ఈనెల 19 సాయంత్రం ఐదు గంటల లోపు 'ది ప్రిన్సిపాల్, యూనివర్శిటీ కాలేజ్, ఆంధ్ర కేసరి యూనివర్శిటీ, ఒంగోలు - 523001' చిరునామాకు నేరుగా లేదా పోస్టు ద్వారా అందజేయాలన్నారు. ఇంటర్వ్యూలను ఈ నెల 21 ఉదయం 11 గంటలకు ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తామని, అభ్యర్థులు వారి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను బోర్డుకి సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏకేయుప్రకాశం.ఏసి.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.



రైతులతో మాట్లాడుతున్న ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ

ప్రజల ఆరోగ్యంపై పురుగు మందుల ప్రభావం

ప్రజాశక్తి - అద్దంకి

మనుషుల ఆరోగ్యంపై పురుగు మందుల ప్రభావం ఉంటుందని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని కలవకూరు గ్రామంలో శుక్రవారం జరిగిన జరిగిన పొలంబడిలో ఆయన మాట్లాడారు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందుల వాడకం వలన భూమి ఆరోగ్యం, మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని తెలిపారు. పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు వాలుకు అనుకూలంగా పిచికారీ చేయాలని తెలిపారు. కళ్ళకు కంటి అద్దాలు పెట్టుకోవాలని, శిరస్త్రాణం ధరించాలని, పురుగు మందులు చేతులతో నేరుగా కలపకూడదని తెలిపారు. పురుగు మందులు ఎక్కువ వాడకం వలన మనుషుల పునరుత్పత్తి, కంటి చూపు, చర్మ సంబంధిత వ్యాధి, క్యాన్సర్ వంటి జబ్బుల బారిన పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ కోటేశ్వరరావు, విఎఎ మస్తానరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు అంద చేస్తున్న హెచ్‌ఎం, దాతలు

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి - అద్దంకి

విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తిమ్మాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గంగాధర్ అన్నారు. ఇంటర్మీడియట్ (బైపిసి) చదివి ఉత్తీర్ణులై ఒంగోలు భార్గవి నర్సింగ్ కాలేజిలో జిఎన్‌ఎం నర్సింగ్ కోర్సు చేరారు. ఇంటర్లో మంచి మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థినులకు ప్రోత్సాహకంగా ప్రతి ఏటా ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున మూడేళ్ల పాటు పారితోషకంను ఇస్తామని కూకట్ల ఫౌండేషన్ గతంలో ప్రకటించింది. ఆ ప్రకారం గత సంవత్సరం మంచి మార్కులు సాధించిన అన్నంగి స్రవంతి, బుసి రమ్యకు రూ.20వేల చొప్పున రూ.40వేలను కూకట్ల ఫౌండేషన్ తరపున కూకట్ల సుబ్బారావు, వింధ్యావళి దంపతులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ హెచ్‌ఎం కెవి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు కూకట్ల సుబ్బారావు దంపతులను సన్మానించారు.ం

ఇద్దరు మహిళల అరెస్టు

ప్రజాశక్తి - కర్లపాలెం

మండలంలోని ప్యార్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని వారి నుండి 27మద్యం సీసాలు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవింద్ర తెలిపారు. తన సిబ్బందితో కలిసి రైడ్ చేసి ఇద్దరి అదుపులోకి తీసుకుని రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వే గేటు తాత్కాలికంగా మూత

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని పట్టణంలోని కారంచేడు రైల్వే గేటును ట్రాక్ మరమ్మతుల కారణంగా మూసివేశారు. ఈనెల 21వరకు 10 రోజుల పాటు గేట్ మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆ గేటు ద్వారా వైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు గమనించి సహకరించాలని, ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని రైల్వే అధికారులు కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న సిడిపిఒ సుభద్ర

ప్రజాశక్తి -యద్దనపూడి

మండలంలోని పూనూరు గ్రామంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పౌష్టిక ఆహారంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సిడిపిఒ సుభద్ర మాట్లాడుతూ తల్లులు పౌష్టక ఆహారం తీసుకొని రక్త హీనత లేకుండా చేసుకొని వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవచ్చని అన్నారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటే పిల్లలూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎఎం శ్రీనివాసరావు, పి సుభాషిణి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుజాత, అంగన్‌వాడీ కార్యాకర్త కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయురాలు కొండమ్మ, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

కర్లపాలెం : పోషకాహారంతోనే మాతృ, శిశు మరణాలను అరికట్టవచ్చని సిడిపిఒ లక్ష్మీపార్వతి అన్నారు. స్థానిక దండుబాట రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. పోషక విలువలు కలిగిన ఆహారం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణీలకు పోషకాహార కిట్లు, చిన్నారులకు అన్నప్రాసన, మాసోత్సవాల సింబల్ పోషణ, న్యూట్రిషియన్ స్టాళ్ళను ప్రదర్శన చేశారు. ఆకుకూరలు, గ్రుడ్డు, పాలు, బెల్లంకు సంబంధించిన ఆహారపదార్థాలు తీసుకోవడం ద్వారా పోషకాన్ని సక్రమంగా అందుతాయని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు వెంకటరత్నం, ఇంచార్జి ఎంపిడిఒ ఎలీషాబాబు, సూపర్వైజర్ నాగమల్లేశ్వరి, జడ్పిటిసి పిట్ల వేణుగోపాలరెడ్డి, సర్పంచ్ నక్కా లలిత కుమారి, కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతకుమారి, వసంత, వాణి, పద్మ, అరుణ పాల్గొన్నారు.

ఇంకొల్లు : అంగన్‌వాడి కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని డిసిపిఒ పురుషోత్తం అన్నారు. స్థానిక ఐసీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడి కార్యకర్తలు, సూపర్వైజర్లతో మాస ఉత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. మాసోత్సవాలతోపాటు వచ్చే నెలలో చేపట్టవలసిన కార్యక్రమాలను ప్రణాళికతో నిర్వహించాలని సూచించారు. బాలింతలు, గర్భవతులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందజేయాలని అన్నారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్రాల్లోని చిన్నపిల్లలకు మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని చెప్పారు. బొమ్మలతో ఆడిస్తూ ఆట, పాటలు నేర్పాలని అన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ ఝాన్సీ, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతమాగులూరు : గర్భిణీలు, బాలింతలు ఆహారంలో ప్రతిరోజు సమతుల ఆహారం తీసుకోవడంలో భాగంగా వాటితో పాటు పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు వంటివి ప్రతిరోజు భోజనంలో ఉండే విధంగా చూసుకోవాలని సిడిపిఓ డి సుధ తెలిపారు. మండలంలోని పాత మాగులూరు ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ అని తెలిసిన వెంటనే పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. తరచుగా చేతులు శుభ్రం చేసుకుంటూ తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. పోషకాహార వంటలు ప్రదర్శించారు. గర్భిణీలు, బాలింతలకు బాల సంజీవని కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుష్మరాణి, కార్యకర్తలు ఝాన్సీ, రాజ్యలక్ష్మి, లలిత, కాంతమ్మ, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

కొల్లూరు : స్థానిక అంగన్‌వాడి సెంటర్లో పౌష్టికాహార మహోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ కొల్లూరు సెక్టర్ సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలకు తక్కువ ఖర్చుతో పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని కోరారు.



కొల్లూరు అంగన్‌వాడి సెంటర్లో పౌష్టికాహార ఉత్సవాలు

ఘనంగా జాతీయ హిందీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 14వ జాతీయ హిందీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐసిఐసిఐ బ్యాంకు మేనేజర్ ఆర్ సైదయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వేల్పుల మోహనరావు మాట్లాడుతూ హిందీ నేర్చుకొవటం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. ఐసిఐసిఐ బ్యాంకు అందించే సేవలును ఆర్ నరసింహారావు వివరించారు. హిందీ ఉపన్యాసికులు ఎంవి సత్యనారా యణ హిందీ భాష దేశానికి ప్రాణవాయు వంటిదని అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం : మండలంలోని అక్కాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 14న హిందీ భాషా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భవనం బద్రిరెడ్డి, హిందీ ఉపాధ్యాయిని ఖమురున్నిసా మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, ఐ బాలసుబ్రమణ్యం, ఖమరున్నీసా బేగం, వాణి పాల్గొన్నారు. పందిళ్ళపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హిందీ భాష దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం ఎం శేఖరరావు, హిందీ ఉపాధ్యాయులు శంఖం లలిత పరమేశ్వరి, బుద్ధి ప్రసన్నాంజనేయులు మాట్లాడారు.



వేటపాలెంలో హిందీ బాషా దినోత్సవం

18న రాష్ట్ర, జాతీయ ఆటల పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పర్చూరు

ఈనెల 18న కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఒంగోలు ఎబిఎం జూనియర్ కళాశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అర్హత పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా పాఠశాల ఆటల పోటీల కార్యదర్శి ఈ చింపారెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, సేబాక్ తక్రా పోటీల్లో అండర్ 14, 17, 19 విభాగాల్లో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అండర్ 14 విద్యార్థులు 2011 జనవరి 1లోపు, అండర్ 17 విద్యార్థులు 2008 జనవరి 1లోపు, అండర్ 19 విద్యార్థులు 2006 జనవరి 1లోపు జన్మించి ఉండాలని తెలిపారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతూ ఎంపిక పోటీల్లో పాల్గొన దలచిన విద్యార్థులు తమ పాఠశాల హెడ్ మాస్టర్, లేదా కళాశాల ప్రిన్సిపాల్ వద్ద నుండి పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తో పాటు 10వ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్ కూడ వెంట తీసుకు రావాలని కోరారు. పాల్గొనదలిచిన కలిగిన క్రీడాకారులు వివరాలకు 98481 25706, 94406 21579 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



చిత్రం గీస్తున్న పంచుమర్తి భవ్యశ్రీ

చిత్రలేఖన పోటీల్లో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - పంగులూరు

ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం, పర్యావరణ, అటవీ, వాతావరణ శాఖ నిర్వహించిన 'మాంట్రియల్ ప్రోటోకాల్ అడ్వాన్సింగ్ క్లైమేట్ యాక్షన్' అనే అంశంపై జాతీయ స్థాయిలో నిర్వహించిన పోస్టర్ కాంపిటీషన్ పోటీలో మండలంలోని కొండమంజులూరు విద్యార్థికి ప్రథమ స్థానం లభించింది. రావుల జానకి రామయ్య జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి చదువుతున్న పంచుమర్తి భవ్యశ్రీ ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం ఇమ్మడిశెట్టి అనిత శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు ఆగస్టు నెలలో నిర్వహించగా ఢిల్లీలోని పర్యావరణ మంత్రిత్వ శాఖ భారతి భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రకటించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 4వేల మంది విద్యార్థులు పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థిని భవ్య శ్రీ ప్రథమ స్థానం సాధించిందని చెప్పారు. విద్యార్థికి తర్ఫీదు ఇచ్చి పాఠశాల పేరు ప్రతిష్టను జాతీయ స్థాయిలో ఇనుము డింపజేసిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు తిరుమల శెట్టి వెంకటేశ్వరరావు మార్గదర్శకత్వం వహించిన విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుల సమిష్టి కృషిని ఆమెతోపాటు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గోలి సంధ్య, గ్రామ పెద్దలు చింతల సహదేవుడు, కొండ మంజులూరు గ్రామస్తులు అభినందించారు. పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థినిని డిఇఒ నారాయణరావు, జిల్లా సైన్స్ అధికారి సాధిక్, డిప్యూటి డిఇఒ అబ్బరాజు శ్రీనివాసరావు, ఎంఇఒ కె నాగభూషణం, జి వీరాంజనేయులు అభినందించారు.

కుట్టుమిషన్ బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాగార్జున మెడికల్స్‌కు చెందిన రాచమల్లు జగదీశ్వర్, జస్వంత్ పుట్టినరోజు సందర్భంగా ధేనువకొండ గ్రామానికి చెందిన పేద మహిళ షేక్ మీరాభికి కుట్టు మిషన్ శుక్రవారం బహుకరించారు. తనకుటుంబ పోషణకుప యోగ పడే మిషన్ అందజేసిన రోటరీ, దాతలకు షేక్ మీరాభి ధన్యవాదాలు తెలిపారు. పుట్టినరోజు కేక్ కట్ చేసి జగదీశ్వర్, జస్వంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, రోటరీ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మొహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ యు దేవపాలన, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, జ్యోతి చంద్రమౌళి, అళహరి హరి ప్రసాద్, సంకా సుబ్రహ్మణ్యం, తమ్మన శ్రీనివాసరావు, రాచమల్లు రాధిక పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - అద్దంకి

వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 అనే అంశంపై జిల్లా స్థాయిలో బాపట్లలో జరిగిన వ్యాసరచన పోటీల్లో తిమ్మాయపలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి చదివుతునన ఆరుద్ర తన్మయి ద్వితీయ బహుమతి సాధించారని హెచ్‌ఎం పి గంగాధర్ తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన పాఠశాల ఉపాధ్యాయురాలు ద్వారకాదేవి, ధనలక్ష్మిని ఆయన అభినందించారు.

14న విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో విద్యుత్తు లైన్ నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 7నుండి 11గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇఇ ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. పంగులూరు, ముప్పవరం సబ్ స్టేషన్ల పరిధిలో ప్రజలు విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

వేమూరు : వేమూరు, పెరవలి 33కెవి సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం ఉదయం 8నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఈ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.



నోటు పుస్తకాలు అందజేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కృష్ణానది వరదల కారణంగా ఇల్లు మునిగిపోయి, సర్వసం కోల్పోయిన విద్యార్థులకు వాసవి క్లబ్ అధ్యక్షులు బూర్లె సుబ్బారావు ఆధ్వర్యంలో పెసరలంక ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. బుర్లే త్రిశూలపణిరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుగుణావతి, కుమారులు విజయ్ కుమార్, కిరణ్ కుమార్ విద్యార్థినీ విద్యార్థులకు పరీక్ష ప్యాడు, పెన్ను, పెన్సిల్, ఎరైజర్, షార్ప్నర్, స్నాక్స్ పంపిణీ చేశారు. ఐపిసి నంబూరు నాగభూషణరావు, చెన్న వెంకట ఉమామహేశ్వరరావు, తూనుగుంట్ల శ్రీధర్, సిల్వర్ సార్ కెసిజిఎఫ్ బొలిశెట్టి శ్రీనివాసరావు, క్లబ్ సెక్రటరీలు కొత్త నాగ వెంకట రవితేజ పాల్గొన్నారు.ద

రైతులకు అందుబాటులో ఉంచాలి..

ప్రజాశక్తి - సంతమాగులూరు

పంటలపై తెగుళ్ల నివారణ, పెంపుదలకు సంబంధించి దశపరిని కషాయాలను నీమాస్త్రం, నిమ్మకాయ, కోడిగుడ్డు రసం, ద్రవ జీవామృతం మొదలగు కషాయాలను గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్ట్ జిల్లా అధికారిణి వాణిశ్రీ తెలిపారు. మండలంలోని కొమ్మాలపాడు, మక్కెన వారిపాలెం, ఏల్చూరు, సంతమాగులూరు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవ్వడంతో రైతులకు అవగాహన కల్పించారు. సహజ సిద్ధమైన చెట్టు ఆకుల నుండి తీసిన కషాయాలను వివిద పంటలపై పిచికారి చేసే విధంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసిఆర్‌పిలు, ఎల్ టు యు ఎల్ వన్ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపిఎం మోహన్, ఎంటి శిరీష, వెంకటలక్ష్మి, వెంకటరత్నం పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత వైసీపీకి లేదు

ప్రజాశక్తి - వేమూరు

ప్రజలు ఆపదలో ఉన్నారని తెలిస్తే ఆదుకునేందుకు ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయని పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత వైసిపి నేతలకు లేదని జనసేన ఇంచార్జ్ ఊసా రాజేష్ అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు హెలికాప్టర్ తప్పా భూమి మీద నడవని జగన్‌కు ఇప్పుడు ప్రజలు గుర్తుకురావడం హాస్యాస్పదం అన్నారు. వరద బాధితులకు సొంత డబ్బు రూ.6కోట్ల సాయం చేసిన అపర దానకర్ణుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు. పవన్ కల్యాణ్ కుటుంబం దానాలకు ప్రతీకలైతే జగన్ కుటుంబం దారుణాలు, దుర్మార్గాలకు నిలువెత్తు సాక్ష్యాలని ఆరోపించారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి కె ప్రశాంతి శుక్రవారం తెలిపారు. రాజీ చేయదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమ తీర్పని తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు ఫీజులు తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు.

14నుండి త్రివిక్రమ పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరులో ఈనెల 14 నుండి 16వరకు శ్రీ త్రివిక్రమ స్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం అవుతాయని ఇఒ నాగయ్య తెలిపారు. 16న శాంతి కళ్యాణం జరుగనున్నట్లు తెలిపారు. టిటిడి దేవస్థానం భావనారాయణ స్వామి బృందంచే అభిషేకం, కళ్యాణం జరుపుతారని తెలిపారు. భక్తులకు హాజరై ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు పొందాలని కోరారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా

ప్రజాశక్తి - కర్లపాలెం

ప్రజలకు వారంలో ఆరు రోజులు నిత్యం అందుబాటులో ఉంటానని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మరాజు అన్నారు. ప్రభుత్వ ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు సేవలు అందించడంతోపాటు అధిక వర్షాలతో విజయవాడ ప్రాంతంతో పాటు లంకగ్రామాలు మునిగిపోయి ప్రజలు అల్లాడిపోయిన సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో వరద బాధితులకు మంత్రులు, ఎంఎల్ఎలు, వివిధ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు సేవ చేయడం చాలా సంతోషన్ని కలిగిస్తుందని అన్నారు. సోమ, మంగళవారం బాపట్ల ప్రధాన కార్యాలయంలో ఉదయం 8 నుంచి 11వరకు, బుధవారం బాపట్ల రూరల్ కార్యాలయంలో, గురువారం కర్లపాలెం, శుక్రవారం పిట్టలవానిపాలెం కార్యాలయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. బ్యూటీ బాపట్ల తయారు చేసి ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నానని తెలిపారు. ఆర్టీసీ, ఏరియా వైద్యశాల, వివిధ ప్రభుత్వ శాఖల్లో త్వరలోనే సమావేశాలు ఏర్పాటు చేసి అధికారుల ద్వారా ఉత్తమ సేవలు అందిస్తామని చెప్పారు. రహదారుల మరమ్మత్తులు



మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగేశన నరేంద్ర వర్మ

చేయిస్తానని చెప్పారు. బాపట్లలో మెడికల్ కళాశాల పనులు త్వరలో ప్రారంభం అవుతాయని, బాపట్లలో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందని తెలిపారు. బాపట్ల పట్టణంలో పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. మార్కెట్ యార్డు వద్ద పురపాలక స్థలాన్ని త్వరలోనే నూతన పార్కుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రం స్థలాన్ని లీజుకి తీసుకొని అక్కడ పార్కు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గొలపల శ్రీనివాసరావు, ముక్కములు సాంబశివరావు, ఆఫ్జాల్, మందపాటి ఆంధ్రయ్య పాల్గొన్నారు.

కాలేజీ చదువులు..మధురమైన జ్ఞాపకాలు

ప్రజాశక్తి - చీరాల

స్నేహపూరిత వాతావరణంలో చదువుకుని ఉన్నత స్థాయికి నాంది పలికే కాలేజీ చదువులు అందరి జీవితాల్లో మధురమైన జ్ఞాపకాలని సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల రిటైర్డ్ లైబ్రేరియన్ పులగూర జయాశీలరావు అన్నారు. కళాశాల ఆవరణంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు, కరస్పాండెంట్ శీలం విద్యాసాగరరావు, ప్రాణహిత హాస్పిటల్ డైరెక్టర్ గడ్డం సుభాషిణి మాట్లాడారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకమైనదని అన్నారు. ఈ దశలో విద్యపై ఆసక్తి చూపితే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. గత ఏడాది బైపీసీ,



ఉత్తమ పురస్కారాలు అందజేస్తున్న అధ్యాపకులు

ఎంపీసీ, సీఈసీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు గడ్డం సుభాషిణి నగదు పురస్కారంతో ప్రోత్సహించారు. తాను జీవితంలో స్థిరపడడానికి సహకరించిన కళాశాలకు తన వంతు సహకారాలు అందజేస్తానని తెలిపారు.

ఘనంగా మౌంట్‌ఫోర్ట్ రజతోత్సవం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని మౌంట్ ఫోర్ట్ పాఠశాల 25వ వార్షికోత్సవం సందర్భంగా రజతోత్సవాన్ని గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక, సాహిత్య, క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మొట్టమొదటిగా కరస్పాండెంట్ మిత్రుల అంచలమైన మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. విలువలు, క్రమశిక్షణ, సమగ్ర ఎదుగుదలను రూపొందించుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థుల ప్రతిభను పెంచుకునేందుకు ఒక గొప్ప వేదికగా పాఠశాల ఉందని అన్నారు. రెండు రోజులు జరిగిన అంతర పాఠశాలల పోటీల్లో ప్రతిభ కనబరచడమే కాకుండా పట్టుదల ఉత్సాహం టీం స్పిరిట్‌తో కూడిన



విద్యార్థులను అభినందిస్తున్న బ్రదర్ కిరణ్‌కుమార్

ఏకాగ్రత ఎవరినైనా విజేతలను చేయగలదని నిరూపించారని అన్నారు. గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి, సర్టిఫికెట్, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బ్రదర్ ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చీరాల

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించినట్లు అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ తెలిపారు. మండలంలోని విజయ లక్ష్మీపురం పరిధిలో ఇసుక అక్రమ త్రవ్వకాలు జరిగిన ప్రదేశాలను డిఎస్పి జగదీష్ నాయక్, తహశీల్దారు గోపికృష్ణతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. రెవెన్యూ, పోలీస్, నీటి పారుదల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి అక్రమ తవ్వకాలను పూర్తిస్థాయిలో కట్టడి చెయ్యాలని ఆదేశించారు. అక్రమ రవాణా జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాల్లో పటిష్ట నిఘా ఉంచాలని చెప్పారు. ప్రభుత్వం సూచించిన స్టాక్ పాయింట్లలో నిబంధనల మేరకు ఇసుక లోడ్ చేసుకొని తగిన రసీదులతో రవాణా చేసుకోవాలన్నారు.



ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ విఠలేశ్వరరావు

గతంలో అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై నిఘా ఉంచాలన్నారు. సమాచారం తెలిసిన వెంటనే ఆ ప్రదేశానికి చెరుకోవాలన్నారు. ఆయన వెంట రూరల్ సిఐ ఎన్ సత్యనారాయణ, నీటిపారుదల శాఖ ఎఇ పురుషోత్తం, సెబ్ సిఐ కర్ణ, రూరల్ ఎస్ఐ శివకుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న డిఎస్పీ జగదీష్ నాయక్

మనోవికాస కేంద్రం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లోని ఎఆర్‌టిలో మందులు వాడుతున్న పేషెంట్స్ కు నిత్యా అన్నదానం ఏర్పాటు చేసిన చైతన్య మనోవికాస కేంద్రం సేవలు అభినందనీయమని హాస్పటల్ సూపర్డెంట్ డాక్టర్ సుభాషిని అన్నారు. స్థానిక వైద్యశాలలో నిత్యా అన్నదానంను డిఎస్పి జగదీష్ నాయక్ ప్రారంభించారు. చైతన్య మనో వికాస కేంద్రం చైర్మన్, ఫౌండర్ నారాయణం వెంకన్నబాబు ముందుకు రావడం హర్షనీయం అన్నారు. అందరికీ ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ఎఆర్టి నోడల్ ఆఫీసర్ డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ ఆహారం లేకపోవడం వలన కూడా మందులు సరిగా వాడడం లేదని చెప్పారు. వెంకన్న బాబు గత 25ఏళ్లుగా మనో వికాస కేంద్రం ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. హాస్పిటల్ ఆర్ఎంఒ శ్రీకాంత్, ఎపి సాక్స్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జానీ బాషా, ఎఆర్టీ సిబ్బంది, ఐసిటిసి, పిపిటిసి, డిఎస్ఆర్సి కౌన్సిలర్స్, ఎన్జీఒ, సిరి పిఎంకె వెంకటరావు పాల్గొన్నారు.

గంగవరంలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని గంగవరంకు చెందిన కరి నాగేంద్రమ్మ (71) మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను శంకర్ కంటి వైద్యశాలకు దానంగా ఇచ్చారు. కొడుకు మల్లికార్జునరావు, కోడలు గీతా వాణి, కుమార్తె విశాలాక్షి, రాజకుమారీ, అల్లుళ్ళు ఉన్నారు. రోటరీ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ, చుండు సాంబశివరావు, సోమేపల్లి రామ్మోహనరావు, జట్టి వెంకటేశ్వర్లు అభినందించారు.

ఎద్దుల బండిని ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన రైతు పాపయ్య తన ఎద్దుల టైరు బండితో ఏల్చూరు నుండి రామిరెడ్డిపాలెం సమీపంలోని తన పొలానికి వస్తున్నాడు. రామిరెడ్డిపాలెం డివైడర్ మధ్యలో రహదారి దాటుతుండగా లారీ అతివేగంగా ఢీకొంది. దీంతో టైరు బండికి కట్టిన రెండు ఎద్దులు కుప్పకూలిపోయాయి. అందులో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా రెండవ ఎద్దుకు తీవ్ర గాయాలు అయ్యాయి. రైతు పాపయ్య స్వల్పంగా గాయపడ్డారు. మృతి చెందిన ఎద్దు రూ.80వేల వరకు ఉంటుందని పాపయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉండటం, అతివేగంగా లారీ రావడంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - చీరాల

104, 108 వాహనాల్లో డ్రైవర్లు, పైలట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ జె నాగేశ్వరావు శుక్రవారం తెలిపారు. పైలట్, డ్రైవర్ ఉద్యోగంకు 10వ తరగతి ఉత్తీర్ణత, హెవీ లైసెన్స్, 35 ఏళ్లలోపు వారై ఉండాలని, ఇంగ్లీష్ చదవడం, వ్రాయడం తప్పనిసరిగా వచ్చి ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 16లోపు చీరాల ఏరియా వైద్యశాల్లోని 104 కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. నిరుద్యోగ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 63053 59961, 83095 30078 నెంబర్లలో సంప్రదించాలి తెలిపారు.

'వాసవీ'లో హిందీ దివస్ వేడుకలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని వాసవీ విద్యానికేతన్ పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఆ పాఠశాల ఏఓ కె.రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునేలా నిర్వహించారు. హిందీ భాషలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన హిందీలో ఉపన్యసించారు. హిందీ భాషని గుర్తించడంలో ఎనలేని కృషి చేసిన బియోహర్ రాజేంద్ర సింహ జయంతి సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు.

గిరిజన గూడేల్లో 'జన్‌మన్'

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని వై చెర్లోపల్లి, నల్లగుంట్ల, అయ్యన్న కుంటగూడెం, పోతున్న గూడెం, నల్లగుంట్ల గూడెం, మల్లికార్జునపురం, కొత్తూరు, బలిజపల్లి చెంచుగూడేల్లో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు రంగయ్య, రామకోటమ్మ ఆధ్వర్యంలో పిఎం జన్‌మన్ కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజనులకు 11 రకాలైటువంటి అందరికీ పక్కా గృహాలు, ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి, గ్రామానికి రహదారులు, ప్రతి ఇంటికి విద్యుత్తు, అందరికీ విద్య, నైపుణ్య వికాసం, అందరికీ ఆరోగ్యం, అందరికీ పౌష్టికాహారం, జీవనోపాదులను మెరుగుపరుచుటటం, ప్రచార సాధన సౌకర్యాలు కల్పించటం వంటి వాటి గురించి చెంచులకు వివరించారు. బలిజేపల్లిగూడెం నందు నీటి సమస్య ఉన్నట్లు తెలపడంతో సమస్యను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి ఆ సమస్యను పరిష్కరిస్తామని సాంకేతిక సహాయకుడు లాల్ అహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో కొండేపి మోహన్‌రావు, జూనియర్ సాంకేతి సహాయకులు యు.బాలగురవయ్య, వెంగయ్య, సిడబ్ల్యూసి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడైన బాలుడు..

ఆసుపత్రిలో కమ్యూనిటీ సర్వీస్ చేసేలా తీర్పు..

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

హత్య కేసులో బాలుడికి 3 సంవత్సరాల కాల వ్యవధిలో ఒక సంవత్సరం పాటు ఏదైనా ప్రభుత్వ హాస్పిటల్‌లో నందు కమ్యూనిటీ సర్వీస్ చెయ్యాలని జువెనైల్ జస్టిస్ బోర్డ్ తీర్పునిచ్చింది. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి దామోదర్ మీడియాకు వెల్లడించారు. అర్ధవీడు పోలీస్ స్టేషన్ పరిధిలో 2018 జులై ఏడున ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఏడవ తరగతి బాలుడుని పక్కనే ఉన్న జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి(బాలుడు) తన కళాశాలలో చదువుతున్న బాలికకు ప్రేమలేఖ ఇవ్వమని కోరగా దానికి నిరాకరించిన బాలుడుని ప్రభుత్వ పాఠశాలలో గల ఒక భవనంలో పెట్రోల్ పోసి అంటించారు. బాలుడు కాలిన తీవ్ర గాయాలతో కంభం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కొరకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2018 జులై 13న మృతిచెందాడు. అప్పటి అర్ధవీడు ఎస్సై రవీంద్రారెడ్డి కేసు నమోదు చేశారు. అప్పటి మార్కాపురం సీఐ భీమా నాయక్ సమగ్ర దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం పోలీసులు సమయానుసారం సాక్షులను కోర్ట్ నందు హాజరుపరుచగా సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.కళావతి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్ధవంతంగా విచారణ నడిపి.. సరైన సాక్ష్యాధారాలతో బాలుడిపై నేరనిరూపణ చేసినందున 2024 నవంబర్ 13న ఒంగోలులోని జువైనల్ జస్టిస్ బోర్డు ఛైర్మన్ అండ్ ప్రిన్సిపిల్ మేజిస్ట్రేట్ పి.భానుసాయి మైనర్ బాలుడుకు 3 సంవత్సరాల కాల వ్యవధిలో ఒక సంవత్సరం కాలంపాటు ఏదైనా ప్రభుత్వ హాస్పిటల్ నందు కమ్యూనిటీ సర్వీస్ చెయ్యాలని తీర్పును ప్రకటించారు. సదరు కేసులో క్రియాశీలకంగా వ్యవరించిన అప్పటి అర్ధవీడు ఎస్సై రవీంద్రారెడ్డి, ప్రస్తుతం పామూరు సీఐ భీమనాయక్, కోర్ట్ లైజన్ కానిస్టేబుల్ వరదయ్యలను ఎస్పీ అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఒంగోలులో ఉన్నతాధికారుల చేతులమీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ప్రశంసా పత్రం పొందిన కె.శ్రీనివాసులు దంపతులను పెద్దదోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో ఎంఈవో బి.మస్తాన్‌నాయక్, ఎంఈవో-2 కొండల్‌రావు, మార్కాపురం ఎంఈవో రామదాసు నాయక్, త్రిపురాంతకం ఎంఈవో తులసి మల్లి కార్జుననాయక్, మాజీ ఎంపిపి ధర్మా నాయక్, యూటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, అధ్యక్షుడు నాగేశ్వరరావు, వర్ధన్, కాశీరాములు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న తహశీల్దార్ చిరంజీవి

అలుగు ఆక్రమణపై నోటీసులు జారీ

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రజాశక్తి కథనానికి స్పందన

'అలుగులో ఆక్రమణలు' పేరుతో ప్రజాశక్తి మినీలో శుక్రవారం కథనం వెలువడింది. అధికార యంత్రాంగం కదిలింది. మార్కాపురం తహశీల్దారు కార్యాలయంలో జల వనరుల శాఖతో పాటు రెవెన్యూ సిబ్బందితో తహశీల్దారు కె.చిరంజీవి సమీక్ష నిర్వహించారు. ఆక్రమణలపై విచా రణ చేపట్టాలని ఆదేశించారు. ఆక్రమణ ప్రాంతానికి అధి కారులు శుక్రవారం సాయంత్రం చేరుకున్నారు. ఆక్రమణ దారుడిని హెచ్చరించారు. నోటీసు జారీ చేశారు. గడువులోగా తొలగించని పక్షంలో తామే తొలగిస్తామని హెచ్చరించారు.

కొనసాగుతున్న అన్నదానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని డొక్కా సీతమ్మ అన్నదాన కేంద్రంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. శుక్రవారం 58వ రోజైన శుక్రవారం సుమారు 150 మందికి భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనసేన ప్రచార కమిటీ కోఆర్డినేటర్, డొక్కా సీతమ్మ అన్నదాన కేంద్రం నిర్వాహకులు జడ బాల నాగేంద్ర యాదవ్ మాట్లాడుతూ ప్రతి రోజు ఒంగోలు నగరంలో ఆకలితో ఉన్నవారికి ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు.

ఇళ్ల స్థలాలలో అనర్హులను తొలగిస్తాం..

- ఇందుకోసం ముగ్గురు సీనియర్ కార్పొరేటర్లతో కమిటీ
- అర్హులైన వారికి రెండు సెంట్ల ఇంటి స్థలం
- రాష్ట్రంలో ఒంగోలును మొదటిస్థానంలో నిలుపుతాం
- ఆరు నెలల్లో 40 శాతం నగరానికి రోజూ తాగునీరు
- పోతురాజు కాలువ పనుల అక్రమాలపై కమిటీ..
- కార్పొరేషన్ కౌన్సిల్ మీటింగ్‌లో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ వెల్లడి
- కార్పొరేషన్‌లో ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు, జనార్ధన్, విజయకుమార్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలబెడతామని స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ మీటింగ్ మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జరిగింది. సమావేశానికి ఎక్స్‌అఫిషియో సభ్యుల హోదాలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మొదటిసారిగా హాజరయ్యారు. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో జరిగింది. సమావేశంలో అనేక అంశాలు చర్చకు వచ్చాయి. 10 అంశాలతో రూపొందించిన అజెండాల్లో ఒక్క అంశం వాయిదా వేశారు.



సమావేశంలో మేయర్ సుజాత



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

మిగిలిన అంశాలను ఆమోదించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో స్థలాలను అభివృద్ధి చేసేందుకుగాను జరిగిన పనుల్లో రూ.1.64 కోట్లు చెల్లించే విషయం ధృవీకరించే విషయాన్ని కౌన్సిల్‌లో వాయిదా వేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ నవరత్నాలు, పేదలందరికి ఇళ్ల కోసం ఏర్పాటుచేసిన లేఅవుట్ల అభివృద్ధి పనులు, భూమి కొనుగోలు వ్యవహారంలో అక్రమాలు జరిగాయని తెలిపారు. దీని మీద విచారణ చేసేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. తరువాత కౌన్సిల్‌లలో సభ్యులు నగరంలో పారిశుధ్యం నిర్వహణ, అందులో జరిగిన అక్రమాల మీద ప్రస్తావించారు. పారిశుధ్య సిబ్బందిని సచివాలయాలకు అనుసంధానం చేసి అక్రమాలు జరగకుండా చూస్తామని జనార్ధన్ హామీ ఇచ్చారు. టిడిపి కార్పొరేటర్ దాచర్ల రమణయ్య, జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ పలు విషయాలను సమావేశంలో ప్రస్తావించారు. శానిటేషన్ పనుల్లో మేస్త్రీల విధానం రద్దు చేసి వారి స్థానంలో వర్కర్లను పనిలోకి తీసుకుంటామని కమిషనర్ కె వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో ప్రతిపక్ష కార్పొరేటర్ల డివిజన్‌లలో అభివృద్ధిపనుల విషయంలో వివక్షత చూపించారని, ఇప్పుడైనా వివక్షకు గురికాబడిన డివిజన్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ కోరారు. సమావేశ అనంతరం ఎమ్మెల్యే జనార్ధన్ పాత్రికేయులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో అందజేసిన 18 వేళ్ల ఇళ్ల పట్టాలలో భారీగా అక్రమాలు జరిగాయని తెలిపారు. 60 శాతం మంది అనర్హులకు పట్టాలిచ్చారని చెప్పారు. అనర్హులను గుర్తించి వారి పట్టాలు రద్దు చేస్తామని చెప్పారు. పట్టాలు అందుకున్న వారిలో అర్హులు ఎవరు, అనర్హులు ఎవరనే విషయం తేల్చేందుకు ముగ్గురు సీనియర్ కార్పొరేటర్లు, ముగ్గురు అధికారులతో కమిటీ వేస్తామని చెప్పారు. వీరు పట్టాలు పొందిన వారందరిని విచారించి అర్హుల జాబితా తయారు చేస్తారని చెప్పారు. వచ్చే కౌన్సిల్ నాటికి అర్హుల జాబితా తయారు అవుతోందని చెప్పారు. అర్హులందరికీ రెండు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్లు కూడా త్వరలో పూర్తి చేసి.. లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. పోతురాజుకాలువ ఆధునీకరణ పనుల్లోనూ అక్రమాలు జరిగాయని, ఇప్పటి వరకు జరిగిన పనుల్లో అక్రమాలు గుర్తించేందుకు కమిటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అమృత్-1 కింద రూ.163 కోట్లతో చేపట్టిన గుండ్లకమ్మ నీటి పథకం, అమృత్-2లో రూ.336 కోట్లతో చేపట్టిన నీటి పథకాలను పూర్తి చేసి నగర ప్రజలకు రోజు తాగునీరు ఏకకాలంలో ఇస్తామని చెప్పారు. రానున్న ఆరు, ఏడు నెలల్లో 40 శాతం నగరానికి రోజు తాగునీరు అందిస్తామని చెప్పారు. నీటి పథకాలకు సంబందించిన పనులన్నీ పూర్తి చేసిన తరువాత ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9.30 లోపు ఒకేరోజు నగరమంతా పగటిపూట నీళ్లు ఇస్తామని చెప్పారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. అగ్రహారం రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయని చెప్పారు. గాంధీపార్కును అభివృద్ధి చేయాలని, అందులో చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్పొరేషన్ బిల్డింగ్ నిర్మాణానికి ఎంపీ నిధులు ఇస్తానని చెప్పారు. సంతనూలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు.

కౌన్సిల్ సమావేశానికి వైసిపి కార్పొరేటర్లు డుమ్మా

ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వైసిపి కార్పొరేటర్లు అంతా డుమ్మా కొట్టారు. వైసిపి నుంచి టిడిపిలో చేరిన కార్పొరేటర్లు, టిడిపి కార్పొరేటర్లు, జనసేన కార్పొరేటర్ మాత్రమే హాజరయ్యారు. వైసిపికి చెందిన మేయర్ గంగాడ సుజాతతోపాటు పలువురు వైసిపి కార్పొరేటర్లు ఇటీవల టిడిపిలో చేరారు. ఈ నేపథ్యంలో వైసిపి చేతిలో సుమారు 20మంది కార్పొరేటర్లు ఉన్నారు. వారెవ్వరూ శుక్రవారం నాటి సమావేశానికి హాజరు కాలేదు. హైదరాబాద్‌లో ఉన్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో వైసిపి కార్పొరేటర్లు భేటీ అయ్యారు. వైసిపి కార్పొరేటర్లు ఎవ్వరూ కార్పొరేషన్ సమావేశానికి రాకపోవడం చర్చనీయాంశమైంది.

బాలినేని చేసేదొకటి...చెప్పేదొకటి..

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనపార్టీ తరుపున కూటమిలో చేరనున్నారనే విషయాన్ని పాత్రికేయులు జనార్ధన్ వద్ద ప్రస్తావించగా బాలినేని చెప్పేది ఒకటి, చేసేది ఒకటి.. అని జనార్ధన్ వ్యాఖ్యానించారు. ఆయన పార్టీ మారే విషయాన్ని ఆయన్నే అడిగితే బాగుంటుందన్నారు. ఆయనకు వయస్సు అయిపోయిందని, ఇంట్లో కూర్చుంటే మంచిదని బాలినేనిని ఉద్దేశించి జనార్ధన్ అన్నారు.